బుగ్గ కాలువ.. ఆనందాల వెల్లువ

- రూ.6.25 కోట్ల వ్యయంతో బుగ్గ కాలువ నిర్మాణం
- ఫలించిన రైతుల ఎదురుచూపులు
- సాగు కష్టాలకు చెక్
- శరవేగంగా బుగ్గ– మంగళం కాలువ నిర్మాణ పనులు
- సుమారు వెయ్యి ఎకరాలకు అందనున్న సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

గత ప్రభుత్వ పాలనలో వెలవెలబోయిన నీటి పారుదల కాలువలు నేడు కళకళలాడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రైతులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే ప్రభుత్వం నగరి నియోజకవర్గంలోని నగరి–విజయపురం మార్గంలో బుగ్గ–మంగళం ఒరవ కాలువను రూ.6.25 కోట్ల నిధులు వెచ్చించి పటిష్టంగా నిర్మిస్తోంది. టీడీపీ పాలనలో కనుమరుగైన నీటిపారుదల కాలువకు ప్రస్తుతం ప్రభుత్వ పాలనలో మోక్షం వచ్చింది


నేడు నూతనంగా నిర్మించిన బుగ్గ మంగళం కాలువ

నగరి: మండలంలో 40 చెరువులు ఉండగా వీటిలో 18 చెరువులు బుగ్గ–మంగళం ఒరవ కాలువకు అనుసంధానంగా ఉన్నాయి. ఈ కాలువ ద్వారా వచ్చి చెరువులకు చేరే నీటి ద్వారా ఆయకట్టు భూములలో పంట సాగవుతుంది. మహానేత వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన ఈ పనులపై అనంతరం వచ్చిన ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంతో పిచ్చిమొక్కలు, మట్టికుప్పలు పడి కాలువే కనుమరుగైంది. ఈ కారణంగా నీటిపారుదల కాలువలో ప్రవహిస్తూ చెరువులకు చేరాల్సిన వర్షపునీరు వృథాగా పంటపొలాలపై పారడంతో పాటు రైతుకు కూడా నష్టాన్ని మిగిల్చేది. సాధారణ రోజుల్లో చెరువు కట్టకింద సాగు చేసే రైతులకు సాగునీరు అందడంలోను పలు సమస్యలు ఎదుర య్యేది. కొన్ని దశాబ్దాలుగా ఈ సమస్య రైతులను వెంటాడుతోంది. దీంతో రైతుకు అండగా నిలిచేందుకు మంత్రి ఆర్కేరోజా నడుం బిగించారు. బుగ్గ–మంగళం ఒరవ కాలువను పటిష్టంగా నిర్మించడానికి రూ.6.25 కోట్లు మంజూరు చేయించారు. కాలువ నిర్మాణ పనులు 95 శాతం ఇప్పటికే పూర్తయ్యాయి. 40 మీటర్ల మేర మాత్రమే కాలువ నిర్మించాల్సి ఉంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు..

కాలువ నిర్మాణం పూర్తయి చెరువులకు నీరు చేరితే గంగమాంబపురం, మంగళం, పన్నూరు, ఎం.అగరం గ్రామాల్లో చెరువునీటిపై ఆధారపడిన 600 ఎకరాలతో పాటు చెరువులు, కాలువల్లో నీరు ఇంకడంతో భూమిలో నీటి శాతం పెరిగి మరో 400 ఎకరాలకు బోర్ల ద్వారా సాగునీరు అందుతుంది.


బుగ్గ మంగళం వరవకాలువ (నాడు)

రైతుల కష్టాలు తీర్చే కాలువ..


మాకు చెరువు కట్టకింద సుమారు 2ఎకరాల పొలం ఉంది. చెరువు నీరే ఆధారం. ఇదివరలో వర్షపు నీటితో చెరువుల్లో నీరు చేరేదే కానీ కాలువల ద్వారా చేరేది కాదు. దీంతో ఏడాదికి ఒక పంట మాత్రమే సాగుచేసేవాళ్లం. ప్రస్తుతం బుగ్గ–మంగళం కాలువ పనులు జరుగుతున్నాయి. దీంతో చెరువు నిండేందుకు ఉన్న సమస్య తీరింది. చెరువులు, కాలువల్లో నీరు చేరితే ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకోవచ్చు.
–రవినాయుడు, గంగమాంబాపురం

బీడు భూములు సాగవుతాయి..


మా గ్రామంలో చెరువు కట్టకింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఎంత వర్షం పడినా బుగ్గ కాలువ ద్వారా వచ్చే వర్షపు నీరు చెరువులోకి చేరడం లేదు. ప్రస్తుతం బుగ్గ–మంగళ ఒరవ కాలువ పనులు పూర్తికావడంతో వర్షపు నీటితో చెరువు తప్పక నిండుతుంది. బీడు భూములు సాగు చేసేందుకు అవకాశం దక్కింది.
–గోవర్ధన్‌నాయుడు, ఎంఅగరం

దశాబ్దాల కల నెరవేరింది


బుగ్గ–మంగళం ఒరవ కాలువ చాలా దుస్థితి చేరుకుంది. ఇదివరలో దాని పరిస్థితి చూస్తే అక్కడ కాలువ ఉందా ? లేదా ? అని కూడా తెలిసేది కాదు. గత ప్రభుత్వాలు ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. మంత్రి ఆర్కేరోజా చొరవతో కాలువలకు పునరుజ్జీవం వచ్చింది. కొన్ని దశాబ్దాల రైతుల కల నెరవేరింది.
–రాజాదాస్, విజయపురం

95 శాతం పనులు పూర్తయ్యాయి..


బుగ్గ ఆనకట్ట నుంచి 8 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన ఒరవ కాలువలో రెండు దఫాలుగా 5.2 కిలోమీటర్ల కాలువ నిర్మాణం ఇదివరకే పూర్తయింది. ప్రస్తుతం ఫైనల్ రీచ్ పనులు 2.8 కిలోమీటర్ల దూరం వరకు కాలువ నిర్మాణం జరుగుతోంది. ఇందులో 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 40 మీటర్ల మేర పనులను త్వరలోనే పూర్తవుతాయి. ప్రత్యక్షంగా 600 ఎకరాలు, పరోక్షంగా 400 ఎకరాలకు సాగునీరు అందుతుంది.
–జి.ప్రశాంత్, ఏఈఈ, విజయపురం

క్లుప్తంగా

ఘనంగా మైలేరు పూజలు


పొంగళ్లతో ప్రదర్శనగా వస్తున్న రజకులు

నగరి: రజక సంఘం వారు ఏటా నిర్వహించే మైలేరు పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్ల కుండలతో పట్టణ పరిధిలో ఊరేగింపుగా వెళ్లిన వారు కుశస్థలి నది ఒడ్డున మైలేరు పూజలను నిర్వహించారు.

ప్రభుత్వ సైన్స్ టీచర్లకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: ఐఐఎస్ఈఆర్, ఆర్ఎస్సీ, ఐఎస్టీఎఫ్ సంయుక్తంగా తిరుపతి భారతీయ విద్యాభవన్ సహకారంతో 50 మంది ప్రభుత్వ సైన్స్ టీచర్లకు రెండు రోజుల శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యం పెంచడానికి, రసాయన శాస్త్ర సైన్స్ పాఠాల బోధనలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. శిక్షణ అనంతరం బోధనా పరికరాల కిట్, సర్టిఫికెట్లను అందజేస్తామని వెల్లడించారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ భారతి మాట్లాడుతూ అవయవ దానంతో చనిపోయిన వ్యక్తికి పునర్జన్మ లభించినట్లేనని తెలిపారు. అవయవ దానం ప్రాముఖ్యతను సమాజానికి తెలయజేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి సీతామహాలక్ష్మి, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు తులసి, స్వాతి, సుజాత, అనిత, శిరీష, సునిత, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

రుయాలో కార్డియో థొరాసిక్ సేవలు


డాక్టర్ కల్యాణి రమకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

తిరుపతి తుడా: రుయాలో కార్డియో థొరాసిక్ వైద్య సేవలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రముఖ గుండె వైద్య శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కళ్యాణి రమ సోమవారం కార్డియో థొరాసిక్ విభాగాధిపతిగా నియమితులయ్యారు. ఆమె విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కళ్యాణిరమ అనంతరం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. సూపరింటెండెంట్ రవి ప్రభు మాట్లాడుతూ రుయాలో కొన్నేళ్లుగా కార్డి యో థొరాసిక్ సేవలు నిర్వహించలేదన్నారు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా విభాగాధిపతిని నియమించినట్టు తెలిపారు. ఇకపై రుయాలో ప్రతి బుధ, శనివారాల్లో ఓపీ నెంబర్ 20లో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అడ్మినిస్ట్రేటర్ ఉమామహేశ్వరరావు, చిరంజీవి, షాహీద పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు.

14న పిల్లలకు ఉచితంగా అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్: తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం, చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం సంయుక్తంగా వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 14న రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో పిల్లలకు ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే శేషగిరిరావు తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, సరస్వతి హోమం చేపట్టి అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తామని తెలిపారు. అలాగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బాసరలో సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పించే కంకణాలు అందజేస్తామన్నారు. ఇందులో పాల్గొన దలచిన వారు ఈ నెల 13వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9985532447, 6301192026, 9440271154లో సంప్రదించాలని తెలియజేశారు. పద్మావతి, సుబ్బారావు, రామకృష్ణ, కామేశ్వరరావు, వెంకటాచలపతి పాల్గొన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పంచామృతం, విబూదితో అభిషేకించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

జీడీ నెల్లూరు సీఐగా శంకర్


గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు అప్‌గ్రేడ్ స్టేషన్ నూతన సీఐగా జీఎం శంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం నూతన సీఐ మాట్లాడతూ రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహణపై సమీక్ష


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: డ్వాక్రా సంఘ సభ్యురాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, వీఓ, డ్వాక్రా సంఘ లీడర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా కంతుల ప్రకారం చెల్లిస్తే రూ.1.50 లక్షల రుణాలు ఇస్తామన్నారు. ముఖ్యంగా పొదుపు పెంచుకోవాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం


గుడ్లు, పాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ

పాలసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైస్ ఎంపీపీ–2 పుష్ప, సర్పంచ్ లిల్లీ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం దళిత వాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులకు, బాలింతలకు అందించారు. సర్పంచ్ లిల్లీ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం, ప్రతి రోజు గుడ్లు వేస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు గుడ్లు, పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్నం భోజనం


భోజనాన్ని రుచి చూస్తున్న ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని జెడ్పీటీసీ అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. సోమవారం వారు చలమరాజు ఇండ్లు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ నరసింహరాజుతో కలసి తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు ఉడికిన గుడు, చిక్కి అందించాలని, తాజా కూరగాయలు ఉపయోగించి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు అవుతుందా ? లేదా ? అని ప్రతి రోజు సచివాలయ ఉద్యోగులు వచ్చి పరిశీలించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ, పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా మున్సిపల్ భవనం


పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో రెండు దశాబ్దాల కల సాకారం కానున్నది. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చొరవతో పుత్తూరు పురపాలక నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రూ.1.97 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన అధునాతన భవనం తుది మెరుగులు దిద్దుకుంటోంది. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి సోమవారం పెయింటింగ్ పనులను పరిశీలించారు. ఈ నెలలోనే మంత్రి రోజా చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

రూ.3.48 కోట్ల సిగరెట్లు సీజ్

తిరుపతి రూరల్: ట్యాక్సులు చెల్లించకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3.48 కోట్ల విలువైన సిగరెట్లను తిరుపతి సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేశారు. వాహనంతో సహా పాట్నాకు చెందిన గోల్డ్ స్టెప్ సిగరెట్ కంపెనీ డైరెక్టర్ బీరేంద్రకుమార్ సింగ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సోమవారం తిరుపతిలోని సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ కమిషనర్ హరిహరన్, అసిస్టెంట్ కమిషనర్ జగన్నాథప్రసాద్ ఆ వివరాలు వెల్లడించారు. పాట్నా నుంచి మైసూర్‌కు అక్రమంగా సిగరెట్లను తరలిస్తున్నారనే సమాచారంతో ఈనెల 1వ తేదీన అనంతపురం హైవేపై దాడులు నిర్వహించామన్నారు. ఆర్‌జే 11 జీబీ 9702 నంబర్ కలిగిన లారీలో దాదాపు రూ.3.48 కోట్ల విలువ కలిగిన గోల్డ్‌స్టెప్, ప్యారీస్ బ్రాండ్‌లు కలిగిన సిగరెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటికి సంబంధించి ట్యాక్స్ చెల్లింపు పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశామన్నారు. లారీలో 56.10 లక్షల సిగరెట్లు ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో విచారించిన నేపథ్యంలో గోల్డ్‌స్టెప్ సిగరెట్ కంపెనీ డైరెక్టర్ బీరేంద్రకుమార్ సింగ్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఏడాదిలో రూ.43.46 కోట్ల అపరాధ రుసుం

తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు పన్నులు చెల్లించని వారిపై రూ.43.46 కోట్ల అపరాధ రుసుం విధించినట్లు జాయింట్ కమిషనర్ హరిహరన్, ఏసీ జగన్నాథప్రసాద్ తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.35.99 కోట్లను వసూలు చేశామన్నారు.

పుత్తూరు ఏఎంసీ చైర్మన్‌గా భాస్కర్‌యాదవ్


ఎస్.భాస్కర్‌యాదవ్


సి.శేఖర్

పుత్తూరు: పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పాలకవర్గానికి గౌరవాధ్యక్షులుగా పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా వ్యవహరించనున్నారు. చైర్మన్‌గా ఎస్.భాస్కర్‌యాదవ్, వైస్ చైర్మన్‌గా సి.శేఖర్, సభ్యులుగా ఎం.జ్యోతి, టి.శశికళ, ఎస్.సుభాషిణి, వి.గౌరీ, ఏ.వడివేలు, ఎస్.పద్మావతి, ఎస్.సుదర్శనవర్మ, వి.సెల్వీ, టి.వరప్రసాద్, బి.ప్రభావతి, కె.జయరామ్, జె.గోపాల్, డీ.ఇ.పెరుమాళ్‌తో పాటు తడుకు సింగిల్‌విండో ప్రెసిడెంట్, తిరుపతి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్, ఏడీఏ పుత్తూరు, మున్సిపల్ చైర్మన్ సైతం సభ్యులుగా కొనసాగనున్నారు.

సచివాలయాల్లో జోరుగా రిజిస్ట్రేషన్లు


రిజిస్ట్రేషన్ కోసం వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారులు

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఎన్‌పీఐ పట్టాల రిజిస్ట్రేషన్లు సచివాలయాల్లో జోరుగా జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కల్యాణపురం, ఎన్జీఓ కాలనీ, సత్యనారాయణ కాలనీల్లోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రచరిత్రలో తొలిసారిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాకుండా, సచివాలయాల్లో వార్డు అడ్మిన్, డబ్ల్యూఆర్ఎస్ లాగిన్స్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఫీజు లేకుండా లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా చేస్తుండడం విశేషమన్నారు.

టీటీడీకి ఈ–బైక్ వితరణ

తిరుమల: శ్రీవారికి సోమవారం బిగాస్ సంస్థ ప్రతినిధులు విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని వితరణ చేశారు. ఈ వాహనం ధర రూ.1.20 లక్షలు. ముందుగా ఆలయం వద్ద వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తాళాలను డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తిరుమల డీఐ జానకిరామ్ రెడ్డి, గాయత్రీ ఆటోమోటివ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తప్పులు ఉంటే సవరించి రిజిస్ట్రేషన్ చేయాలి

తిరుపతి అర్బన్: నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా జగనన్న లేఅవుట్లలో ఇంటిపట్టాలు పొందిన వాటిలో తప్పులుంటే సవరించి రిజిస్ట్రేషన్ చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీ శ తెలిపారు. విజయవాడ నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీసీఎల్ఏ సాయిప్రసాద్ సోమవారం ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ రిజిస్ట్రేషన్లకు చెందిన పలు అంశాలను జేసీ శుభం భన్సల్‌తో కలసి అధికారులకు వివరించారు. హెడ్ ఆఫీస్ నుంచి సవరణలైన వెంటనే వాటికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, డీఎల్‌డీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: క్షయవ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సక్రమంగా మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన పాలసముద్రం బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు సూపర్‌వైజర్ సుశీల, మురళితో కలిసి క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధికి గురైనవారు మానసికంగా కుంగిపోవద్దని, సకాలంలో వ్యాధిని గుర్తించి మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. వ్యాధిని గుర్తించడం చాలా సులభమని, ఆకలి లేకపోవడం, రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, అకస్మాత్తుగా బరువు కోల్పోయిన లక్షణాలు కలిగి ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి డాట్ పద్ధతిలో మందులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ కోటేశ్వరన్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ పుష్పకుమారిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా పుష్పకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా కైలకుంట్ల మండలంలో పని చేస్తున్న ఈమె ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలానికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలపై వచ్చే రైతులకు పరిష్కారం చూపాలని సూచించారు. సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలసి శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్ కలసి సన్మానించారు. అదేవిధంగా మండల సర్వేయర్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామ సర్వేయర్లు కలసి శాలువతో సన్మానించారు.

వెదురుకుప్పంలో..


శివయ్య

వెదురుకుప్పం: మండల తహసీల్దార్‌గా శివయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో తిరుపతి జిల్లా బీఎస్‌కండ్రిగలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శివయ్యను పదోన్నతిపై ఇక్కడకు బదిలీ చేశారు. సోమవారం విధుల్లో చేరిన ఆయన సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. అదే విధంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెనుమూరులో..


సుభద్ర

పెనుమూరు(కార్వేటినగరం): మండల తహసీల్దార్‌గా సుభద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నంద్యాల జిల్లా బనగానపల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై పెనుమూరు వచ్చారు. అదేవిధంగా ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న కళావతి సత్యసాయి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

శ్రీరంగరాజపురం


ఆల్ఫ్రెడ్

శ్రీరంగరాజపురం: మండల తహసీల్దార్‌గా ఆల్ఫ్రెడ్ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న ఈయనను శ్రీరంగరాజపురం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా జరిగేలా పని చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన స్పందనలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

నింద్ర తహసీల్దార్‌గా నాగమణి


నాగమణి

నింద్ర: మండల తహసీల్దార్‌గా నాగమణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూల్ జిల్లా పాణ్యం మండల తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న భగవతి వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భం తహసీల్దార్ నాగమణి మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు.

పాలసముద్రం తహసీల్దార్‌గా సుబ్బులక్ష్మమ్మ


సుబ్బులక్ష్మమ్మ

పాలసముద్రం: పాలసముద్రం తహసీల్దార్‌గా పి.సుబ్బులక్ష్మమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె సత్యసాయి జిల్లా కదిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో డీఏఓగా పని చేస్తున్నారు. ప్రస్తుతం పాలసముద్రం మండల తహసీల్దార్‌గా వచ్చారు.

నగరి తహసీల్దార్‌గా చంద్రశేఖర్ రెడ్డి


చంద్రశేఖర్ రెడ్డి

నగరి: నగరి తహసీల్దార్‌గా ఎస్.చంద్రశేఖర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో తహసీల్దార్‌గా ఉన్న జి.చంద్రశేఖర్ రెడ్డి బదిలీపై నంద్యాలకు వెళ్లడంతో కడప జిల్లా నుంచి బదిలీపై తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి నగరికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ పరమైన అన్ని వ్యవహారాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.